
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 234 | శుక్రవారం 25 ఏప్రిల్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-



## పిఠాపురంలో 100 పడకల
# ఆసుపత్రికి శంకుస్థాపన

**వ్యవసాయ యంత్ర పరికరాలు, మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ**

**బిజీబిజీగా గడిపిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**





**అంకుశం ప్రత్యేక ప్రతినిధి పిఠాపురం**

పిఠాపురంలో 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రి భవనానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రూ.34 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ ఆసుపత్రిలో రెండు కొత్త బ్లాకులు, ఓపీ వార్డు, మార్చురీ వార్డు, డయాలసిస్, బ్లడ్ బ్యాంక్, అధునాతన మెషీన్లు అందుబాటులోకి రానున్నాయి. ఆసుపత్రి నిర్మాణం ద్వారా పిఠాపురం నియోజకవర్గంలోని 3 లక్షల మంది ప్రజలతోపాటు ఆరు పరిసర మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్టు ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. - మిగతా3లో





### ఉగ్రదాడులను నియంత్రించడంలో
# మోదీ ప్రభుత్వం విఫలం

**అన్నివర్గాల వారికి సమాన న్యాయం చేయాలనేది కాంగ్రెస్ సిద్ధాంతని**

**బీజేపీ సొంత రాజ్యాంగం అమలు చేస్తూ ప్రజలను మోసం చేస్తుందని**

**50 శాతం రిజర్వేషన్ ఎత్తి వేసి.. అవసరమైన మేరకు అమలు చేయాలి**

**ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల**

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

భారత రాజ్యాంగ సంరక్షణ కోసం తమ పార్టీ నేతలు ఉద్యమిస్తున్నామని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఏప్రిల్ 9వ తేదీన అహ్మదాబాద్‌లో కాంగ్రెస్ న్యాయపథ్‌పై నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఏపీలో ఈ న్యాయపథ్ ద్వారా వాస్తవాలను ప్రజలకు వివరిస్తామని అన్నారు. బీజేపీ సొంత రాజ్యాంగం అమలు చేస్తూ ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. ఏపీసీసీ ఎగ్జిక్యూటివ్ - మిగతా3లో

## ఉగ్రవాదంపై పోరులో కేంద్రానికి
# అండగా ఉంటాం

- స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు
- ఉగ్రవాదులకు సరైన సమాధానం చెప్పేలా కేంద్రం తీసుకునే ఎలాంటి నిర్ణయానికైనా కట్టుబడి ఉంటా
- పహల్గామ్‌లో జరిగిన భయంకరమైన ఉగ్రదాడి తనను తీవ్ర ఆవేదనకు గురిచేసింది

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**



ఉగ్రవాదంపై పోరాటంలో కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ప్రభుత్వం అండగా నిలుస్తారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఉగ్రవాదులకు సరైన సమాధానం చెప్పేలా కేంద్రం తీసుకునే ఎలాంటి నిర్ణయానికైనా కట్టుబడి ఉంటామని అన్నారు. పహల్గామ్‌లో జరిగిన భయంకరమైన ఉగ్రదాడి తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని ముఖ్యమంత్రి అన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఈమేరకు తన సంఘీభావాన్ని తెలిపారు. ఉగ్రవాదులది పిరికిపంద చర్య అని, హింసను ఖండిస్తున్నామని ఆయన అన్నారు. పహల్గామ్ బాధితుల కుటుంబాలకు అండగా నిలుస్తామని తెలిపారు. భారతదేశ భద్రతను కాపాడే విషయంలో మోదీ నాయకత్వానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. మే 2వ తేదీన చేపట్టే రాజధాని పనుల పున:ప్రారంభానికి ప్రధాని నరేంద్రమోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించారు. అమరావతిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను ప్రధానికి వివరించారు. దీనిపై స్పందించిన ప్రధాని మోదీ.. రాజధాని నిర్మాణానికి సంబంధించి పలు సూచనలు చేశారు. అమరావతిలో పచ్చదనం పెంచేందుకు - మిగతా3లో

## కొడిమి జర్నలిస్ట్ కాలనీలో
# ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం

**10 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల వరకు పాల్గొనవచ్చు**

**జర్నలిస్టు పిల్లలను ఉత్తమ క్రికెటర్లుగా తయారు చేయడమే లక్ష్యం**

**ప్రతిభను గుర్తించేందుకే శిక్షణా శిబిరం**


**మచ్చా రామలింగారెడ్డి రాష్ట్ర అధ్యక్షులు**

**చైర్మన్, ఏపీ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ట్రస్ట్**




**అంకుశం స్పోర్ట్స్ ప్రతినిధి అనంతపురం ఏప్రిల్ 25**

ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లను గుర్తించి ప్రోత్సహించాలన్న లక్ష్యంతో అనంతపురం రూరల్ మండలంలోని కొడిమి గ్రామం కొడిమి జర్నలిస్ట్ కాలనీలో మచ్చా క్రికెట్ అకాడమీ నందు ఈనెల ఏప్రిల్ 26వ తేదీ నుంచి జిల్లాలోని క్రికెట్ నేర్చుకోవాలని క్రికెట్ లో ఉన్నత స్థానాలకు వెళ్లాలని ఆసక్తి ఉన్న చిన్నారులు జర్నలిస్టుల పిల్లలకు - మిగతా2లో




# ఆర్డీటీని కాపాడండి

**కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురండి**

**ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోండి**

**మంచో ఫెర్రర్ కృషిని గుర్తించండి**

**సీఎం చంద్రబాబుకు లేఖ రాసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ**

VicenteFerrer Rural Development Trust

**(అంకుశం, అమరావతి, ఏప్రిల్ 25):**

రాష్ట్రంలో అత్యంత వెనుకబడ్డ అనంతపురం జిల్లాలో గత 55 సంవత్సరాలకు పైగా బడుగు బలహీన వర్గాలు దళితులు సంక్షేమం కోసం పనిచేస్తున్న విద్యవైద్య క్రీడారంగంలో విశేషంగా కృషి చేస్తూ జిల్లా అభివృద్ధికి పాటుపడుతున్నరూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)కి ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ ద్వారా నిధులకు సంబంధించి రెన్యూవల్‌ను పునరుద్ధరించేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఆర్డీటీ కార్యకలాపాలకు ఆటంకం లేకుండా చూడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం - మిగతా2లో



# ‘పవన్.. మీరు సామాన్యులను, దళితులను పట్టించుకోరా?’




**తాడేపల్లి :** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురంలో దళితులను వెలివేస్తే ఆయన అస్సలు పట్టించుకోలేదని, ఇక దళితురాలైన హోంమంత్రి అనిత సైతం ఆ వైపే కన్నెత్తి చూడలేదని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజమెత్తారు. వీరయ్య చౌదరిని మద్యం గొడవల్లో చంపేస్తే హోంమంత్రి అక్కడకు పరిగెత్తారని, మీకు డబ్బున్న వారే కనిపిస్తారా? అంటూ పేర్ని నాని ప్రశ్నించారు. మీకు డబ్బున్నవారినే తప్పితే పేదలు, సామాన్యులు, దళితులను పట్టించుకోరా? అని నిలదీశారు. ఇంతకంటే దిగజారిన, దిక్కుమాలిన ప్రభుత్వం మరొకటి ఉంటుందా? అని పేర్ని నాని మండిపడ్డారు. ఈరోజు’(శుక్రవారం) తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి మాట్లాడారు పేర్ని నాని.

**కూటమి ప్రభుత్వానికి బిల్డప్ ఎక్కువ.. బిజినెస్ తక్కువ**

ఏపీలో కూటమి ప్రభుత్వానికి బిల్డప్ ఎక్కువ, బిజినెస్ తక్కువ అంటూ ఎద్దేవా చేశారు పేర్ని నాని, గతంలో తమ ప్రభుత్వ హయాంలో అప్పులపై విషం ప్రచారం చేశారని, ఎల్లో మీడియా, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరి నానాయాగి చేశారన్నారు. పెద్దపెద్ద మేధావులకే చంద్రబాబు ఆర్థిక పాఠాలు నేర్పురారన్నట్లుగా జాకీలతో లేపారని, ఇప్పుడు చంద్రబాబు రూ. లక్షా 3 వేల కోట్లు అప్పు నేరుగా తెచ్చారన్నారు. ‘రూ.44 వేల కోట్లను కార్పొరేషన్ ల ద్వారా తెచ్చారు. ఒక లక్షా 47 వేల కోట్లకు పైనే అప్పు చేశారు. జగన్ చేసిన అప్పులతో పోర్టులు, సచివాలయాలు, ఆర్బీకేలు, స్కూళ్ల అభివృద్ధి ఇలా అనేక రూపాల్లో కనిపిస్తున్నాయి. జగన్ ఖర్చు చేసిన ప్రతి రూపాయికి లెక్క ఉంది. కానీ చంద్రబాబు చేస్తున్న అప్పులు ఏం చేస్తున్నారో చెప్పటం లేదు. ఎన్నికలకు ముందు ఉత్తరకుమారుడిలా చంద్రబాబు మాటలు చెప్పారు. ఇప్పుడేమో సంక్షేమ పథకాలు ఎలా ఇవ్వాలో అర్థం కావటం లేదంటున్నారు. చంద్రబాబు మాటలకు పవన్ కళ్యాణ్ చిడతలు కొడుతున్నారు. తాజాగా లక్షా 91 వేల కోట్ల విలువైన గనులను తాకట్టు పెట్టేశారు.రూ.9 వేల కోట్ల అప్పుల కోసం తాకట్టు పెట్టారు. దీనిమీద ఎల్లోమీడియా ఎందుకు మాట్లాడటం లేదు?, ఆరు మాసాలకు చెందిన కిస్తీలను ముందుగానే బ్యాంకులో వేయాలనే నిబంధన పెట్టటం దుర్మార్గం.

**చంద్రబాబు అప్పులు చేయడమే పనిగా పెట్టుకున్నారు**

అప్పు ఇచ్చిన వారు రిజర్వ్ బ్యాంకులో ఉండే ప్రభుత్వ నిధులను నేరుగా తీసుకోవచ్చని కూడా నిబంధన పెట్టారు. ఇంతకంటే దుర్మార్గం ఇంకేమైనా ఉంటుందా? , ఇలాంటి వ్యవహారాలు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. అసలు ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎలా నిధులు డ్రా చేసుకునే అవకాశం కల్పిస్తారు? , ఇంతకంటే బరితెగింపు ఉంటుందా?, జగన్ కంటే ఎక్కువగా సంక్షేమం అందిస్తామనీ, అప్పు చేయకుండా సంపద సృష్టిస్తామని అప్పట్లో తెగ బిల్డప్పులు ఇచ్చారు. ఇప్పుడు ఒక్క పథకాన్ని కూడా అమలు చేయటం లేదు. రాష్ట్రం అంటే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లకు అమరావతి ఒక్కటేనా?, ఎన్నికలకు ముందు అద్దె ఆఫీసుల్లో ఉన్నవారు ఇప్పుడు ప్యాలెస్లు కడుతున్నారు. పవన్ కళ్యాణ్ ఎన్నికలకు ముందు కారుపైకి ఎక్కి ప్రయాణించారు. ఇప్పుడు జనానికి కనపడకుండా ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లలో తిరుగుతున్నారు. సొంత కుటుంబ సభ్యుల దగ్గరకు వెళ్లాలన్నా ప్రత్యేక విమానాలే. రాష్ట్ర ప్రజల సొమ్ముతో విలాసాలు చేస్తారా? , ఈ విమానాలు, హెలికాప్టర్లకు ఎవరి డబ్బు ఖర్చు పెడుతున్నారో ప్రజలకు చెప్పాలి. ఫీజు రియంబర్స్మెంట్ నిధులు ఇవ్వకుండా ప్రత్యేక విమానాలకు ఖర్చు పెడతారా?’ అని పేర్ని నాని ధ్వజమెత్తారు.

# జాతీయ ప్రాజెక్టుగా రాజధాని?

**విజయవాడ :** నవ్యాంధ్ర రాజధాని అమరావతిని.. ఇప్పటి వరకు ఊహిస్తున్న దానికి భిన్నంగా.. మరింత డెవలప్ చేసేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు ప్రయత్నాలుచేస్తోంది. దీనిలో భాగంగా.. రాజధానిని జాతీయ ప్రాజెక్టుగా తీర్చిదిద్దేందుకు ఉన్న అన్ని మార్గాలను అన్వేషిస్తోంది. ఈ క్రమంలో ప్రధాన జాతీయ రహదారులతో రాజదానిని అనుసంధానించే ప్రక్రియకు సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ఇది పూర్తయితే.. అమరావతి.. అందరిదీ అనే భావనను మరింత పెంచి.. దీనిని పొరుగు రాష్ట్రాలకు కూడా చేరువ చేయనున్నారు. ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడులు పెట్టేవారిని ఆహ్వానిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. దీనికి తగిన విధంగా ఏర్పాట్లు చేస్తోంది. అంతర్జాతీయ విమానాశ్రయం అమరావతిలోనే ఉండేలా చర్యలు తీసుకుంటోంది. దీనికి సంబంధించి మరో 30-40 వేల ఎకరాల భూమిని సేకరించే దిశగా అడుగులు వేసింది. ఇది పూర్తయ్యేందుకు రెండేళ్ళ గరిష్ఠ సమయాన్ని నిర్దేశించుకుంది. ఇక, ఈ క్రమంలోనే రహదారుల విస్తరణకు కూడా.. కీలక నిర్ణయాలు తీసుకుంది. దీనిలో భాగంగా.. చెన్నై-కోల్‌కతా -హైదరాబాద్‌లతో రాజధానిని అనుసంధానించే జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. 2015-19 మధ్యే దీనికి సంబంధించిన కార్యాచరణ రూపొందించినా.. వివిధ కారణాలతో ముందుకు సాగలేదు. కానీ.. ఇప్పుడు దీనిని సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. తద్వారా.. రాజధానిని దేశవ్యాప్తంగా.. అన్ని ప్రాంతాలకు అనుసంధానించాలని నిర్ణయించింది. దీనిలో కీలకమైన మూడు రహదారులపై మాస్టర్ ప్లాన్‌రెడీ చేసుకుంది. ఎలివేటెడ్ కారిడార్-5, ఎలివేటెడ్ కారిడార్-13, నేషనల్ హైవే ? 13లను నిర్మించి..వాటి ద్వారా హైదరాబాద్, చెన్నై, కోలకత వంటి నగరాలకు అమరావతిని కలుపుతారు.. తద్వారా.. దేశవ్యాప్తంగా రహదారి కనెక్టివిటీ మెరుగుపడుతుంది. పలువురుపెట్టుబడి దారులు.. కూడా..ఈ మార్గాలపై ఇటీవల సీఎం చంద్రబాబుతో చర్చించారు.



దీంతో ఈ విషయంపై తాజాగా సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. అదేసమయంలో కేంద్రానికి కూడా సమాచారం పంపించి.. ఆయారహదారుల నిర్మాణంపై క్లారిటీతీసుకుంటారు. దీంతో అమరావతి రాజధానిని జాతీయ ప్రాజెక్టుగా మరింత తీర్చిదిద్దాలని చంద్రబాబు భావిస్తున్నారు.

**పటేల్ తరహాలో**

అమరావతిలో 600 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతిలోని నీరుకొండపై 600 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. విగ్రహ బేస్‌లో ఎన్టీఆర్ జీవితం, కళాకృతులు, మినీ థియేటర్ తదితరాలు ఉండనున్నాయి. డీపీఆర్ తయారీకి కన్సల్‌టెంట్ కోసం టెండర్లు ఆహ్వానించారు. నందమూరి తారకరామారావు భారీ విగ్రహాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెండు రోజుల కిందట మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, ఏడీసీ సీఎండీ లక్ష్మీ పార్థసారథి గుజరాత్ పర్యటనలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని సందర్శించి వచ్చారు. ప్రాథమిక అంచనాల మేరకు 600 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఇందులో నీరుకొండ ఎత్తు 300 అడుగులు ఉంటుంది. దీని మీద 100 అడుగుల ఎత్తులో బేస్‌ను నిర్మిస్తారు. ఈ బేస్‌లోనే ఎన్టీఆర్ మెమోరియల్ హాల్, ఎన్టీఆర్ మ్యూజియం, ఎన్టీఆర్ జీవిత చరిత్ర తెలుసుకునేలా కళాఖండాలు, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్ ఉంటాయి. ఈ బేస్ పైన 200 అడుగుల ఎత్తైన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు.

# కొడిమి జర్నలిస్ట్ కాలనీలో ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం

-మొదటిపేజీ తరువాయి

బాలురకు, మహిళా క్రికెట్ పై ఆసక్తి ఉన్న చిన్నారులకు ప్రత్యేక వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని మచ్చా రామలింగారెడ్డి రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ చైర్మన్ ఏపీ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ట్రస్ట్ తెలిపారు.




జిల్లాలో రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి క్రికెటర్లను తయారు చేయడమే లక్ష్యంగా ఆసక్తి కల యువ క్రికెటర్లకు క్రికెట్ నేర్చుకోవాలని ఆసక్తి ఉన్న పిల్లలను, వర్కింగ్ జర్నలిస్టు పిల్లలను ఉత్తమ క్రికెటర్లను తయారు చేయాలన్న లక్ష్యంతో వారికి మంచి శిక్షణ ఇచ్చి క్రికెటర్లుగా తయారు చేయాలన్న ఉద్దేశంతోనే జిల్లాలోని ప్రతిభ ఉన్న జర్నలిస్టు పిల్లలను, ఆసక్తి ఉన్న యువ క్రికెటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రతిభ ఉన్న వారిని గుర్తించేందుకు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. 10సంవత్సరాల నుంచి 25 సంవత్సరాలలోపు ఉన్న యువకులందరూ ఈ ఉచిత క్రికెట్ శిక్షణలో పాల్గొనవచ్చునని అందరూ ఉపయోగించుకోవాలని మచ్చా రామలింగారెడ్డి కోరారు.

రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా అనంతపురం జిల్లాలో కొడిమి జర్నలిస్టు కాలనీలో ఆసక్తిగల యువ క్రికెటర్లకు చిన్నారులకు జర్నలిస్టుల పిల్లల కోసం ప్రత్యేకంగా ఉచితంగా క్రికెట్ శిక్షణ శిబిరం నిర్వహించడం ఒక్క రూపాయి కూడా డబ్బు తీసుకోకుండా ఉచితంగా క్రికెట్ నేర్పించడం జరుగుతుందని రాష్ట్రంలో ఎక్కడ కూడా ఇటువంటి ఉచిత క్రికెట్ శిక్షణ లేదని మచ్చా రామలింగారెడ్డి అన్నారు. ఎక్కడ క్రికెట్ శిక్షణ జరిగిన డబ్బులు వసూలు చేస్తారని అన్నారు.

అటువంటిది జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 10 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాలు లోపు ఉన్న బాల బాలికల క్రికెటర్లు వర్కింగ్ జర్నలిస్టు పిల్లలందరికీ కొడిమిలో ఉచితంగా క్రికెట్ శిక్షణ ఇస్తున్నామని అన్నారు క్రికెట్ అంటే వ్యాపారంగా మారి పేదవాడికి అందుబాటులో లేకుండా అయినటువంటి ఈ పరిస్థితుల్లో ఉచితంగా నేర్పించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని తీసుకున్నామని మచ్చా అన్నారు

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రస్తుతమున్న సత్యసాయి జిల్లా అనంతపురం జిల్లాలో ఉన్న క్రికెట్ నేర్చుకోవాలని ఆసక్తి ఉన్న చిన్నారులందరూ వర్కింగ్ జర్నలిస్టు పిల్లలందరూ ప్రింట్ %డ% ఎలక్ట్రానిక్ మీడియా, చిన్న పత్రికలు, సబ్ ఎడిటర్ల పిల్లలు యూట్యూబ్ ఛానల్స్ పిల్లలు ఇతర మీడియాకు సంబంధించిన వారందరూ ఈ ఉచిత శిక్షణలో పాల్గొనవచ్చునని మచ్చా రామలింగారెడ్డి అన్నారు

క్రికెట్ కు అవసరమైన క్రికెట్ సామాగ్రి క్రీడాకారులకు ఏపీ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఉచితంగా ఇస్తుందని మచ్చా రామలింగారెడ్డి తెలిపారుక్రికెట్ నేర్చుకోవాలని ఆసక్తి ఉన్న బాల బాలికలు ఈనెల 22వ తేదీ సాయంత్రంలోపు కొడిమి జర్నలిస్టు కాలనీలో క్రికెట్ అకాడమీలో నేరుగా వారి పేర్లను నమోదు చేసుకోవచ్చని ఆధార్ కార్డు ఉంటే చాలని మచ్చా తెలిపారు.

ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం అనంతరం క్రికెటర్లకు సర్టిఫికెట్లు ప్రధానం చేయడం జరుగుతుందని మచ్చా రామలింగారెడ్డి అన్నారు సీనియర్ క్రికెటర్లతో క్రికెట్ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తామని శిక్షణను ఇవ్వడానికి సీనియర్ క్రికెటర్లను ఎంపిక చేయడం జరిగిందని మచ్చా రామలింగారెడ్డి వివరించారు. క్రికెట్ నేర్చుకోవాలని ఆసక్తి గలవారు ఆధార్ కార్డు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి ఈనెల 25 తారీకులోపు కె.విజయరాజు జిల్లా కార్యదర్శి కి కొడిమి జర్నలిస్ట్ కాలనీలో అప్లికేషన్లు ఇవ్వాలి. సెల్ నెంబర్9490062555ఇతర వివరాలకు సంప్రదించవచ్చునని మచ్చా రామలింగారెడ్డి తెలిపారు

## పిఠాపురంలో 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ ఆసుపత్రి నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల కాలంలోనే నియోజకవర్గంలో రూ.100 కోట్లతో అభివద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. అనంతరం పిఠాపురం నియోజకవర్గంలో వ్యవసాయ యంత్ర పరికరాలు, మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయడంతో పాటు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు.

## ఉగ్రదాడులను నియంత్రించడంలో మోదీ ప్రభుత్వం విఫలం

-మొదటిపేజీ తరువాయి

సమావేశం శుక్రవారం) విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో షర్మిల, కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ఈ సదర్భంగా షర్మిల మీడియాతో మాట్లాడుతూ... అన్నివర్గాల వారికి సమాన న్యాయం చేయాలనేది కాంగ్రెస్ సిద్దాంతని ఉద్ఘాటించారు. 50 శాతం రిజర్వేషన్ ఎత్తి వేసి.. అవసరమైన మేరకు అమలు చేయాలని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమంగా తాము ప్రజల్లోకి వెళ్తామని అన్నారు. ఉగ్రవాదుల దాడులను నియంత్రణ చేయడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపణలు చేశారు. పర్యాటకులు చనిపోతుంటే.. అక్కడ ఉన్న భద్రత దళాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అసలు దాడులు జరుగుతాయనే నిఘావర్గాల సమాచారం ఉందా లేదా అని ప్రశ్నించారు. పక్క దేశం వాళ్లు వచ్చి దాడులు చేస్తే అడ్డుకోలేరా అని షర్మిల నిలదీశారు. మన దేశం మీద జరిగిన ఉగ్రవాద దాడే ఇదని షర్మిల చెప్పారు. మనమంతా కలిసి ఐక్యంగా ఎదుర్కొందామని అన్నారు. బీజేపీ మత రాజకీయాల కోసం ఉగ్రదాడి ఘటనను వాడుకుంటుందని.. ఇది చాలా బాధాకరమని చెప్పారు. అక్కడ ముస్లింలను కూడా చంపేశారని.. అది హిందువులపైన దాడిగా ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఆ ప్రాంతం చాలా సురక్షితంగా ఉందని.. మోదీ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రచారం చేసుకున్నారని గుర్తుచేశారు. వారి మాటలు నమ్మి వెళ్లినందుకు అమాయకులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. మరి ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. న్యాయపథ్ ద్వారా ప్రజల్లోకి రాజ్యాంగం పరిరక్షణ అంశాలను తీసుకెళ్లే విధంగా కార్యాచరణ సిద్ధం చేశామని సీడబ్ల్యూసీ సభ్యులు కొప్పుల రాజు అన్నారు. సామాజిక న్యాయం విషయంలో మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు బీజేపీ అన్యాయం చేస్తోందని విమర్శలు చేశారు. కాంగ్రెస్ 40 రోజుల పాటు రాజ్యాంగ పరిరక్షణ క్యాంపెయిన్ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాదని.. సొంత రాజ్యాంగం అమలు చేస్తుందని విమర్శించారు. 1949లోనే అంబేద్కర్ స్వయంగా చెప్పారని.. రాజ్యాంగ నిర్మాణంలో కాంగ్రెస్ నేతలు సహకరించారని గుర్తుచేశారు. ఇప్పుడు బీజేపీ అసత్యాలు ప్రచారం చేస్తోందని.. వాటినే తాము ప్రజల్లోకి తీసుకెళ్తామని కొప్పుల రాజు వెల్లడించారు.

## ఉగ్రవాదంపై పోరులో కేంద్రానికి అండగా ఉంటాం

-మొదటిపేజీ తరువాయి

ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం మియావాకి విధానాన్ని అమలు చేయాలని సూచించారు. పనులు పున:ప్రారంభించే కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రధానమంత్రి అంగీకారం తెలిపారు. మరోవైపు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పురోగతిని, ఆర్ఐఎన్ఎల్ గురించి ప్రధానికి సీఎం వివరించారు. ఎస్సీ వర్గీకరణకు కేంద్రం ఆమోదం తెలిపినందుకు ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్‌టీపీసీ, ఆర్సెలర్ మిటల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్‌కు మద్దతు, అలాగే బీపీసీఎల్ రిఫైనరీ మంజూరు విషయంలోనూ ప్రధానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఆరామ్‌కో భాగస్వామ్యాన్ని ఖరారు చేయడంతో అదనపు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈసారి రాష్ట్ర పర్యటనలో శ్రీశైలం కూడా సందర్శించాలని నరేంద్రమోదీని చంద్రబాబు కోరారు.

## ఆర్డీటీని కాపాడండి

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. లేఖలోని సారాంశం ఇలా.. 1969లో విన్సెంట్ ఫెర్రర్, అన్నే ఫెర్రర్ దంపతులచే ఆర్డీటీని మొట్ట మొదటి సారిగా అనంతపురంలో స్థాపించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదరికం, బాధలు, అన్యాయాలను నిర్మూలించేందుకు, సమాన అవకాశాలు, సంపదను అందరికీ అందించేందుకు సంస్థను స్థాపించారు. తద్వారా కరువు పీడిత ప్రాంతాల్లో ఫుడ్%-%ఫర్%-%వర్క్ కార్యక్రమాన్ని ప్రారంభి వేలాదిగా బావులు తవ్వటం, లక్షలాది గృహాల నిర్మాణం, కుష్టు వ్యాధి కేంద్రం స్థాపన వంటి పనులు చేపట్టింది. తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించి కూలీలను రైతులుగా మార్చడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సౌకర్యాలను మెరుగు పరిచేందుకు మొబైల్ లైబ్రరీలు, స్కూళ్లు ఏర్పాటు చేయడమే కాకుండా స్కాలర్‌షిప్‌లను అందిస్తోంది. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్‌లలో రెండు సెకండరీ ఆసుపత్రులు, ఒక ప్రైమరీ హెల్త్‌కేర్ సెంటర్‌ను స్థాపించి రోజువారీ 3 వేల మంది పేదలకు ఆసుపత్రుల ద్వారా సేవలను పొందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులే కాకుండా నేరుగా విదేశాల నుంచి నిధులు తెచ్చి అనంతపురం జిల్లాతో పాటు కర్నూలు, చిత్తూరు, నెల్లూరు జిల్లాలు, తెలంగాణలోని పలు ప్రాంతాల్లోని వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం సంస్థ డైరెక్టర్ మాంచో ఫెర్రర్ తీవ్ర కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే స్పందించి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించేలా కేంద్రంపై ఒత్తిడి పెంచి ఆర్డీటీని ఆదుకోవాలని కె.రామకృష్ణ కోరారు.

## వంశీ ఇంకెన్నాళ్లు...

**విజయవాడ :** గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పోలీసులు అరెస్టయి దాదాపు డెబ్బయి రోజులు అవుతుంది. అయినా ఆయన ఇంకా జైలులోనే మగ్గుతున్నారు. కేసుల మీద కేసులు ఆయనపై వరస పెట్టి పెడుతున్నారు. అందుకోసమే బెజవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వల్లభనేని వంశీని టీడీపీ కార్యాలయంలో ఉన్న సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపుల కేసులో వల్లభనేని వంశీని ఈ ఏడాది ఫిబ్రవరి 13న అరెస్ట్ చేశారు. అంటే నేటికి వల్లభనేని వంశీ అరెస్టయి దాదాపు డెబ్బయి రోజులవుతుంది. కొన్ని కేసుల్లో బెయిల్ వస్తున్నా మరికొన్ని కేసుల్లో మాత్రం బెయిల్ లభించడం లేదు. అందుకే ఆయన విజయవాడ జిల్లా జైలులోనే మగ్గిపోతున్నారు.. గన్నవరం పోలీస్ స్టేషన్ లో నమోదైన రెండు కేసుల్లో పీటీ వారెంట్లు జారీ అయ్యాయి. వారెంట్లపై నేడు విచారణ చేపట్టనున్న న్యాయస్థానం నిర్ణయాన్ని వెలువరించనుంది. కేవలం సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపుల కేసులతో పాటు గన్నవరం నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్స్ అక్రమ తవ్వకాలపై కూడా కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులోనూ వల్లభనేని వంశీ నిందితుడిగా ఉన్నారు. వీటికి తోడు భూ కబ్జాల ఆరోపణలపై కూడా వంశీపై అనేక కేసులు నమోదు కావడంతో ఒక దాంట్లో బెయిల్ వస్తే మరొక కేసు మెడకు చుట్టుకుంటుంది. ఫిబ్రవరి 13న... వైసీపీ అధికారంలో ఉండగా వల్లభనేని వంశీ వ్యవహరించిన తీరుపై ఆగ్రహంగా ఉన్న కూటమి ప్రభుత్వం వల్లభనేని వంశీని అరెస్ట్ చేస్తుందని ముందే తెలిసినప్పటికీ ఇలా వరస కేసులు వచ్చిపడతాయని ఊహించలేదు. సోషల్ మీడియాలో టీడీపీ క్యాడర్ ప్రభుత్వాన్ని నిలదీస్తుండటంతో ఇక ఫిబ్రవరి 13న పకడ్బందీగా కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. వల్లభనేని వంశీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గన్నవరం నియోజకవర్గాన్ని వదిలేసి హైదరాబాద్ లోనే ఉంటున్నారు. అక్కడే మకాం వేశారు. అయితే పోలీసులు మాత్రం అన్నికోణాల్లో ఆలోచించి వరస కేసులు నమోదవుతుండటంతో ఇప్పట్లో వల్లభనేని వంశీ బయటకు వచ్చే అవకాశం కనిపించడం లేదు. తాను వేసిన సింగిల్ బ్యారక్ కాదని, అందరిలోనూ కలిపి ఉంచాలని, బయట నుంచి ఆహారాన్ని తెప్పించుకునేందుకు అవకాశం ఇవ్వాలని వల్లభనేని వంశీ గతంలో న్యాయస్థానాన్నిఆశ్రయించారు. అదే సమయంలో మిగిలిన ఖైదీలతో పాటు తనను ఉంచాలని కూడా కోరారు. తనకు ప్రాణభయం ఉందని కూడా వల్లభనేని వంశీ చెప్పారు. అయితే వరసగా కేసులు నమోదవుతుండటం, ఒక కేసులో బెయిల్ వచ్చినా మరొక కేసులో అరెస్ట్ చేయడానికి పోలీసులు అన్నీ సిద్ధం చేస్తున్నారు. అందుకే వల్లభనేని వంశీ ఇప్పట్లో బయటకు వచ్చేందుకు ఛాన్స్ లేదు. ఇంకా బెజవాడలోని మండుటెండలకు మరికొద్ది కాలం జైలులోనే ఉండి పోవాల్సి పరిస్థితులు ఉన్నాయంటున్నారు.

కేడర్ లోనూ నిరుత్సాహం

గత ఏడాది జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఘోరంగా పరాజయం పాలైన వైసీపీని చాలా మంది వదిలేశారు. కీలక రెడ్డి నాయకుల నుంచి అనేక మంది బీసీల వరకు..

## నరేంద్ర మోడీ నేతృత్వంలో

# దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుంది






**– కేంద్ర ఆర్థిక శాఖ సహాయ రాష్ట్ర మంత్రి పంకజ్ చౌదరి**

**అంకుశం ప్రతినిధి పెనుకొండ, ఏప్రిల్ 25:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుంది అనికేంద్ర ఆర్థిక శాఖ సహాయ రాష్ట్ర మంత్రి పంకజ్ చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం పాలసముద్రంలో నాసిన్ వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలలో కేంద్ర మంత్రులుపాల్గొన్నారు.పాలసముద్రంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ అకాడమిలో 75వ ఇండియన్ రెవిన్యూ సర్వీసెస్ (%×=ూ%) పాసింగ్ ఔట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ రాష్ట్ర మంత్రి పంకజ్ చౌదరి హాజరయ్యారు. రెండవసారి నాసిన్ అకాడమీకి వచ్చిన మంత్రి పరేడ్ ను పరిశీలించి, ట్రైనీ ఐపీఎస్ ల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ట్రైనీ ఆఫీసర్లకు బంగారు పథకాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి పంకజ్ చౌదరి మాట్లాడుతూ ..ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో దేశం అభివృది పథంలో నడుస్తోందన్నారు. స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి ముద్ర యోజన పథకాలు ప్రవేశపెట్టి పేద బలహీనవర్గాల యువతి యువకులకు ఉపాధి కల్పించడమే ముఖ్య ఉద్దేశంగా పనిచేస్తుందన్నారు. 2047 నాటికి వికసిత భారత్ ద్వారా భారతదేశ దిశా దశ నిర్దేశాన్ని మార్చడమే ముఖ్య ఉద్దేశమని పంకజ్ చౌదరి తెలిపారు. ప్రపంచ స్థాయి వసతులు కలిగిన ఈ నాసిన్ అకాడమీలో రెండవ బ్యాచ్ లో42 మంది అధికారులు ఉన్నారు వీరులు 25 మంది పురుషులు,17 మంది మహిళా అధికారులు ఉన్నారు, వీరిలో రాయల్ గవర్నమెంట్ ఆఫ్ భూటాన్ చెందినవారు 5 మంది అధికారులు ఉన్నారు. రెండవ బ్యాచ్ అధికారుల పాసింగౌట్ పారెడ్ కి హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. మన మిత్ర దేశమైన భూటాన్ అధికారులు కూడ ఇక్కడ ట్రైనింగ్ కావడం ఇరు దేశాల మైత్రికి దోహదపడుతుందన్నారు. ప్రధానమంత్రి నరేద్ర మోదీ భారతదేశ అభివృద్ధి, యువత కోసం ఎన్నో ఆకర్షణీయ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. సేవభావం, దేశ భక్తితో విధులు నిర్వహించాలి అని ప్రధానిమోదీ భావనను మనసులో ఉంచుకుని తమ తమ విధుల్లో ప్రతిభ చాటాలన్నారు. పాలాసముద్రంలోని ఈ అకాడమీ నిర్వహణలో ఛైర్మెన్ సంజయ్ కుమార్ అగ్రవాల్, డైరెక్టర్ జనరల్ Dr. సుబ్రహ్మణ్యం యొక్క పాత్ర కీలకమన్నారు. భవిష్యత్తులో మరింత మంది సమర్థత కలిగిన అధికారులు దేశ సేవ చేయడం కోసం ఈ అకాడమీ నుంచే రావడంజరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సి బి ఐ సి బోర్డు మెంబర్ శ్రీమతి అరుణ నారాయణ గుప్త, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి







**: అన్ని బస్టాండ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయాణికులకు త్రాగునీరు అందించాలి**

**: జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,**

**అంకుశం న్యూస్ అనంతపురం, ఏప్రిల్ 25 :** అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో రోడ్డు భద్రతపై విస్తృతమైన అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా రోడ్డు భద్రతా సమావేశాన్ని, ఎన్సిఓఆర్డీ (నార్కో కోఆర్డినేషన్ సెంటర్, NCORD) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ తో కలిసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా కోసం తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని బ్లాక్ స్పాట్లలో పోలీస్ శాఖ కోరుకున్న విధంగా ప్రమాదాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు జాగ్రత్తగా అమర్చాలన్నారు. ఆయా చోట్ల సూచిక బోర్డ్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు భద్రత కింద ఆటోలు, వాహనాలు ఓవర్ లోడింగ్ తో వెళ్లకుండా అవగాహన కల్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించాలన్నారు. అన్ని బస్టాండ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయాణికులకు త్రాగునీరు అందించాలని ఆర్టీసీ ఆర్ఎంను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతంలో ప్రతి గ్రామంలోనూ పట్టణ ప్రాంతాలలో ప్రతి వార్డులలో చలివేంద్రియాలను ఏర్పాటు చేయాలన్నారు. వేసవిలో పిల్లల పట్ల జాగ్రత్తలు వహిస్తూ వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలనీ డీఈఓ ను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ ..

మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై అవసరమైన అవగాహన కల్పించడం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్.అండ్ బి ఎస్ఈ రాజగోపాల్, డిటిసి వీర్రాజు, జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు, డీఎస్పీలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మే నెలలో శ్రీ కోదండ రామాలయం లో విశేష ఉత్సవాలు



**అంకుశం న్యూస్ తిరుపతి ఏప్రిల్ 25:** తిరుపతి శ్రీ కోదండ రామస్వామివారి ఆలయంలో మే నెలలో విశేష ఉత్సవాలు జరుగనున్నాయి.
మే 3, 10, 17, 24, 31వ తేదీల్లో శనివారం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీ సీతారామ లక్ష్మణుల మూలవర్ల అభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను నాలుగు మాడ వీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం ఆలయంలో ఊంజల్‌సేవ జరుగనుంది. మే 2న ఆలయంలో పుష్పయాగానికి అంకురార్పణ.మే 3న శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు పుష్పయాగం.మే 12వ తేదీ పౌర్ణమి నాడు ఆలయంలో ఉదయం 8.30 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం జరుగనుంది. ఈ సందర్భంగా సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సీత లక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల ఊరేగి దర్శనం ఇవ్వనున్నారు. మే 18న అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 8 గంటలకు శ్రీ కోదండరామస్వామి వారి ఆస్థానం. మే 22న హనుమజయంతి సందర్భంగా రాత్రి 7 గంటలకు హనుమంత వాహనం.మే 27న అమావాస్య సందర్భంగా ఉదయం 8 గంటలకు సహస్ర కలశాభిషేకం చేపడతారు. రాత్రి 7 గంటలకు హనుమంత వాహనసేవ జరుగనుంది.మే 30వ తేదీ పునర్వసు నక్షత్రం సందర్భంగా ఉదయం 11 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు.

## విజన్ 2029.. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలు

**– ఏపీలో పెట్టుబడులకు అపార అవకాశాలు**

**– సీబీఎన్ బ్రాండ్‌తో ఉక్కు రంగంలో పెట్టుబడులు**

**– ముంబైలోని ఇండియా స్టీల్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో మంత్రి టీజీ భరత్**




**(అంకుశం, అమరావతి, ఏప్రిల్ 25):** ఉక్కు రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్‌లో మంచి అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ చెప్పారు. భారత ఉక్కు మంత్రిత్వ శాఖ మరియు ఫిక్కి ఆధ్వర్యంలో ముంబైలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఇండియా స్టీల్ 2025 పేరుతో ఉక్కు రంగంపై 6వ అంతర్జాతీయ ప్రదర్శన – సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి టి.జి భరత్ బృందం పాల్గొనింది. ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొనేందుకు దేశ, విదేశాల నుండి పెద్ద పెద్ద స్టీల్ కంపెనీల ప్రతినిధులు వచ్చారు. ఈ అవకాశాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకొని రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు ఏపీ ప్రభుత్వం కషి చేస్తున్నట్లు మంత్రి టి.జి భరత్ పేర్కొన్నారు. ఎగ్జిబిషన్‌లో భాగంగా రాష్ట్ర మంత్రి టి.జి భరత్ అధ్యక్షతన సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్ – అపార అవకాశాలు పేరుతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర భారీ పరిశ్రమలు – ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సంజయ్ రాయ్, ఏపీ పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఈవై మాడరేటర్ వినాయక్ విపుల్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీల ప్రతినిధులతో మంత్రి టి.జి భరత్ ముఖాముఖిగా మాట్లాడారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అపార అవకాశాలపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు దూరదష్టితో హైదరాబాద్ ఇప్పుడు మహానగరంగా అభివద్ధి చెందిన విషయాన్ని పెట్టుబడిదారులతో పంచుకున్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ అభివద్ధి కోసం సీఎం చంద్రబాబు కంకణం కట్టుకున్నారని పేర్కొన్నారు. కేవలం సీబీఎన్ బ్రాండ్‌తోనే ఏపీకి పెట్టుబడిదారులు తరలివస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల్లోనే ఎనిమిదిన్నర లక్షల కోట్ల పెట్టబడులు రాష్ట్రానికి వచ్చాయని వివరించారు.
విజన్ 2029, స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలు పెట్టుకొని సీఎం చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర అభివద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు పెట్టుబడిదారులు ముందుకు రావాలని కోరారు. అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లి మండలంలో రెండు దశల్లో రూ.1,47,162 కోట్ల వ్యయంతో ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా మేనేజ్‌మెంట్ సంవత్సరానికి మొత్తం 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తుందని వివరించారు. కాన్ఫరెన్స్ అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ దేశ, విదేశీ కంపెనీల ప్రతినిధులు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలిపారు. పెట్టుబడిదారుల ప్రశ్నలన్నింటికీ తాము సమాధానమిచ్చి వారి సందేహాలన్నీ నివత్తి చేసినట్లు పేర్కొన్నారు. వీరితో నిరంతరం మాట్లాడుతూ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తామని చెప్పారు.

## అత్యున్నతమైన మార్కులుసాధించిన విద్యార్థులను సత్కరించిన ఎమ్మెల్యే నల్లమిల్లి





**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 25:** అనపర్తి మండలం రామవరం లో అనపర్తి మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2025 సంవత్సరంగాను విడుదలైన పదవ తరగతి ఫలితాలలో శ్రీ రామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కి చెందిన విద్యార్థి జిల్లాస్థాయిలో 592 మార్కులను సాధించి మొదటి స్థానంలో నిలిచిన శ్రీ సత్తి కోదండరామిరెడ్డి తో పాటుగా అత్యున్నతమైన మార్కులను సాధించిన విద్యార్థులను సత్కరించి, అభినందించిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించడం ఎంతో ఆనందదాయకంగా ఉందన్నారు.

## ఉత్తమ ఎంపీటీసీ గా అవార్డు అందుకున్న పామూరు 2 ఎంపీటీసీ సభ్యులు ఆకుపాటి వెంకటేష్




**కనిగిరి ఏప్రిల్ 25 అంకుశం న్యూస్:** జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవములు సందర్భంగా.జిల్లా ఉత్తమ ఎంపీటీసీ గా జిల్లా ఎంపీటీసీ ల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు . శుక్రవారం ఒంగోలు లో ని మల్లయ్య లింగం భవన్ లో జరిగిన పంచాయతీరాజ్ వేడుకల్లో కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణ రెండవ ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ పంచాయతీరాజ్ వ్యవస్థాపక జాతీయ ప్రధాన కార్యదర్శి వీరభద్ర చారి చేతులమీదుగా ఉత్తమ ఎంపీటీసీ గా అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమం లో అవార్డు కు ఎంపికైన జిల్లా లోని వివిధ మండలాలకు చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రశాంతి స్కూల్ లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 25:** అనపర్తి మండలం రామవరం లో 2025 సంవత్సరంగాను విడుదలైన పదవ తరగతి ఫలితాలలో కుతుకులూరు ప్రశాంతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కి చెందిన విద్యార్థులు అత్యున్నతమైన మార్కులను సాధించిన సందర్భంగా విద్యార్థులను సత్కరించి, అభినందించిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈకార్యక్రమంలో ప్రశాంతి స్కూల్ యాజమాన్యం తాతా రెడ్డి, ఉపాధ్యాయులు, అనపర్తి మండల, కుతుకులూరుగ్రామ కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ధర్మవరం లో జనసేన ర్యాలీ




**అంకుశం న్యూస్ ధర్మవరం ఏప్రిల్ 25:** జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడి హేయమైన చర్య ధర్మవరంబీబీ జమ్మూ కాశ్మీర్ లోని వహల్గామ్ వద్ద జరిగిన ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని జనసేన రాష్ట్ర నాయకులు చిలకం మధు సూధనరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ దాడిని జనసేన తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు.దేశ సమైక్యతను దెబ్బతీసే ఉగ్రవాద చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించరాదని అన్నారు.పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు చేసిన ఈ దాడి, దేశ శాంతి భద్రతలను భంగ పరిచే విదంగా ఉందని, రాజకీయాలకు అతీతంగా, ఈ దాడులకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాడవలసిన సమయం ఆసన్నమైందని వారి స్పష్టం చేశారు. బాధితులకు తగిన న్యాయం జరిగే విదంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ముష్కరులపై కఠిన చర్యలు తీసుకోవాలని ,భవిష్యత్తులో ఇటువంటి దాడులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ ఘటనలో మరణించిన బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ర్యాలీ లో మేకల బాలకృష్ణ, బెస్త శ్రీ నివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం



**అంకుశం న్యూస్ తిరుమల ఏప్రిల్ 25:** హైదరాబాద్ కు చెందిన అపర్ణ ఎంటర్ ప్రైజస్ లిమిటెడ్ (వెటిరో టైల్స్) సంస్థ శుక్రవారం శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళంగా అందించింది. ఈ మేరకు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు ఆ సంస్థ ప్రతినిధి బి.రమేష్ విరాళం డీడీని అందజేశారు.

## ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో

# 10 వేల రూఫ్ టాప్ యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యం

- జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, ఏప్రిల్ 25:** శ్రీ సత్య సాయి జిల్లాలోపియం సూర్య ఘర్ పథకంపైప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 10 వేల రూఫ్ టాప్ యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యం గా ప్రణాళికలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని కోర్టు హాలు నందు నియోజకవర్గాల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...పియం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. ఎస్సి,ఎస్టి లబ్దిదారులకు కేంద్ర ప్రభుత్వం 60వేల రూ.లు, రాష్ట్ర ప్రభుత్వం 55 వేల రూ.లను సబ్సిడీగా అందించి నూరు శాతం ఉచితంగా అందిస్తుందని తెలిపారు.వారి అవసరాలకు వినియోగించు కోగా మిగిలిన విద్యుత్ ను గ్రిడ్ కు అందిస్తే యూనిట్ కు 2రూ.ల 90 పైసలు వంతున చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు.ప్రస్తుతం ఎస్టి, ఎస్సిలకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, ఈపథకం అమలుతో వారికి మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు.అదే బిసి వర్గాలకు అయితే 2కిలో వాట్ కు కేంద్రం 60 వేల రూ.లు, రాష్ట్ర ప్రభుత్వం 20 వేలు అందించనుండగా మరో 35 వేల రూ.లను లబ్దిదారులు బ్యాంకు ద్వారా రుణం పొంది 5ఏళ్ళ కాలపరిమితితో తిరిగి చెల్లించ వచ్చని అన్నారు.జిల్లాలోని అందరూ RDOలు వ్యక్తిగతంగా సోలార్ రూఫ్ టాప్ సెటప్ ప్రోగ్రామ్ మరియు ప్రతి నియోజకవర్గానికి 10,000 దరఖాస్తులు వచ్చే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. గౌరవనీయులైన ఎమ్మెల్యేలు, ఆర్డిఓలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, డిఇఇలు, తహశీల్దార్లు, ఎపిఎం, ఎంఇపిఎంఎ మరియు బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని SE APSPDCL ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.మీ డివిజన్ స్థాయిలోని మీ డిఇఇలకు కాల్ చేసి పిఎం సూర్య ఘర్ యొక్క సాధ్యాసాధ్యాలను ధృవీకరించాలని ఆర్డిఓలకు ఆదేశించారు... అన్ని నియోజకవర్గ ప్రత్యేక అధికారులు నియోజకవర్గ దార్శనిక ప్రణాళికను క్రమం తప్పకుండా నివేదికలను సిద్ధం చేయాలని తెలిపారుఅందరూ RDO లు వ్యక్తిగతంగా సోలార్ రూఫ్ టాప్ సెటప్ ప్రోగ్రామ్ మరియు ప్రతి నియోజకవర్గానికి 10,000 దరఖాస్తులు ప్రజల దగ్గర నుంచి ఆహ్వానించాలి ..పిఎం సూర్య ఘర్ పథకం దరఖాస్తుల గురించి సమావేశం నిర్వహించడానికి గౌరవనీయులైన ఎమ్మెల్యేలు, ఆర్డిఓలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, డిఇఇలు, తహశీల్దార్లు, ఎపిఎం, ఎంఇపిఎంఎ మరియు బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని SE APSPDCL అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయ సారథి ఆర్డీవోలు పుట్టపర్తి సువర్ణ, ధర్మవరం మహేష్, పెనుగొండ ఆనంద్, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, డిపిఓ సమత, DMHO ఫిర్జ్ బేగం, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, సిపిఓ విజయ్ కుమార్, నెడ్ కాప్ అధికారి, తదితరులు పాల్గొన్నారు

## మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమం ను ప్రారంభించిన ఎమ్మెల్యే నల్లమిల్లి.

- అభివృద్ధి, సంక్షేమం మేళవించి ఈ ప్రభుత్వం ముందుకు వెళుతుంది: ఎమ్మెల్యే నల్లమిల్లి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 25:** వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్,బీసీ కార్పొరేషన్ నియోజకవర్గం సంబంధించి మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే. ఈ సమావేశంలో ముందుగా పహల్గాం దగ్గర పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలని రెండు నిముషాలు మౌనం పాటించిన అనంతరం అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పూర్తిగా అప్పులపాలు చేసి ఆర్థిక సంక్షోభం తీసుకువచ్చింది. ఇవాళ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక ప్రక్క ఆర్థికంగా రాష్ట్రాన్ని బలోపేతం చేయాలని, ఒక ప్రక్క మౌళిక వసతులు కల్పించాలి అనే ధేయంతో పని చేయడం జరుగుతుంది. ముఖ్యంగా మీ అందరికీ తెలుసు గత ప్రభుత్వంలో రోడ్లు వ్యవస్థ ఏ విధంగా ఉందో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ విధంగా సరిదిద్దుతుందో కూడా మీరంతా చూశారు. మీరంతా రకరకాలుగా ఆటోలో వచ్చారు, టూవీలర్ పైన వచ్చారు వివిధ రకాలుగా వచ్చారు. గత ప్రభుత్వ%శీ%లో ఏదైనా ఒక గ్రామం నుంచి ఇంకొక గ్రామానికి ప్రయాణం చేయడానికి ఎంత నరకం అనుభవించారో మీకు తెలుసు. ఇవాళ ఎంత సౌకర్యంగా మీరు ప్రయాణం చేయగలుగుతున్నారు. ఇవాళ కేంద్ర%శీ% నుండి సహకారం సక్రమంగా అందుతుంది. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ వాటిని వినియోగిస్తున్నారు. ఈ ఒక్కరోజు మీకు ఇక్కడ జరిగే కార్యక్రమం కోటి 30 లక్షల రూపాయలు విలువంటే, సంక్షేమ కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతా ఉన్నాయో ఆలోచన చేయమని మీరందరికీ విజ్ఞప్తి చేస్తున్నా. సుపరిపాలన అంటే అభివృద్ధి, సంక్షేమం ఈ రెండింటినీ మేళవించి తీసుకెళ్లాలని ఆలోచనతో ఇవాళ్ళ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. గత ప్రభుత్వం హయంలో ఒక్క సంక్షేమ పేరుతో బీసీ కార్పొరేషన్, ఎస్సీ కార్పొరేషన్ ఇతర కార్యక్రమాలు అన్నింటినీ రద్దుపరిచి అవన్నీ నవరత్నాలు పేరుతో పంపిణీ చేసి, దాంతో ఏదో సంక్షేమం చేసామని జగన్మోహన్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు మాట్లాడటం సమంజసమైన విధానం కాదు. ఏదైతే కేంద్రం అనుమతించిన కార్యక్రమాలు జరగాలి, ఏదైతే రాజ్యాంగం అనుమతించిన కార్యక్రమాలు జరగాలి, ఆ తరువాత జరగాల్సిన సంక్షేమం ఏదైతే మేనిఫెస్టోలో ప్రకారంగా వెళ్తున్నాం దాని అర్థం చేసుకొని మాట్లాడమని వైఎస్ఆర్సిపి నాయకులకు మీ సమక్షంలో వారికి చెప్తున్నా. అదే విధంగా ఈ తొమ్మిది నెలల కాలంలో అనపర్తి నియోజకవర్గంలో ఇప్పటివరకు 90 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేసాం. R&B రోడ్లు ఏ విధంగా చేసామో చూసారు. అదే విధంగా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మాణం చేస్తా ఉన్నాం. రేపు జల శక్తి మిషన్ కింద గ్రామాల్లో తాగునీటి వసతి కల్పించాలని ముందుకు వెళ్తా ఉన్నాం. అదేవిధంగా గ్రామాల్లో అనేక దేవాలయాల పునర్నిర్మానం కోసం నిధులు ఇచ్చాం, అనేక చోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరుగుతోంది. ఇవాళ అన్ని విధాలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పరచాలని, సంక్షేమ దిశలో పయనించాలని లక్ష్యంతో చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఇవాళ ముందుకు వెళ్తా ఉంది. ఈ అభివృద్ధి కార్యక్రమాలు చూసి ప్రజల్లో చులకన అవుతున్నామని భావంతో వైఎస్ఆర్సిపి నాయకులు పసలేని ఆరోపణ చేస్తా ఉన్నారు. ఇవాళ బహిరంగంగా చర్చించటానికి మేము సిద్ధంగా ఉన్నాం. సూపర్ సిక్స్ కార్యక్రమాలు కానీ, గతంలో జరిగిన నవరత్నాలు విషయంలో కానీ, ఇవాళ జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతున్నాయి ,అభివృద్ధి కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతున్నాయి. గత ఐదు సంవత్సరాలు అభివృద్ధి కార్యక్రమాలు ఏ విధంగా జరిగాయి. దానిపైన బహిరంగ చర్చకు ప్రతి కూటమి నాయకుడు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి కి ఈ సందర్భంగా తెలియజేస్తున్నా. ఏదైనా ఇవాళ నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమ ధ్యేయంగా ముందుకెళ్తా ఉన్నాం. రాష్ట్రం ప్రభుత్వం,అదే విధంగా కేంద్ర ప్రభుత్వం సహకరించడం జరుగుతుంది. నాలుగు మండలాల్లో కూడా ఈ శిక్షణ తరగతులు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్నదంతా మహిళలు. మహిళలు ఈ శిక్షణ కార్యక్రమంలో దాదాపు 60 రోజుల పాటు పాల్గొనడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు వారిని కంటికి రెప్పలా చూసుకోవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. వారు వివిధ గ్రామాల్లో శిక్షణా కేంద్రానికి వస్తారు వాళ్ళ గౌరవం కాపాడాలి అదే విధంగా ముఖ్యంగా వాళ్ళ అవసరాలు ముఖ్యంగా టాయిలెట్స్ కు సంబంధించి గాని, ఇది వేసవి కాబట్టి ఫ్యాన్స్ సక్రమంగా ఉండేలాగా చూసుకోవాల్సిన బాధ్యతను సక్రమంగా మంచినీరు అందించడం ఈ విధమైన కార్యక్రమాల్లో కూడా ఎంపీడీవోలు ఎక్కడా తప్పిదం జరగకుండా చర్యలు తీసుకోమని సందర్భంగా కోరుతున్నా. అదే విధంగా ఇవాళ మహిళలు మరియు వివిధ గ్రామాల నుంచి అక్కడకు రావడం ఇవన్నీట్లో ఎవరైనా కొద్దిగా ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నం చేసిన వెంటనే ఎంపీడీవోలు పోలీస్ స్టేషన్ కి తగిన సమాచారం ఇచ్చి అటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోమని కూడా ఈ సందర్భంగా కోరుకుంటూ ఇవాళ కూటమి నాయకులందరికీ కూడా విజ్ఞప్తి చేసుకుంటున్నా.. మీ అందరూ కూడా ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా జాగ్రత్తతో పరిశీలించమని విజ్ఞప్తి చేస్తున్నా. అదే విధంగా కూడా ప్రభుత్వ ఒక నిర్ణయం తీసుకుంది. గతంలో నుంచి ఏదైతే పెండింగ్ అప్లికేషన్స్ ఉన్నాయి నిర్ణయం తీసుకుంది కాబట్టి కూటమి నాయకులందరూ మీ మీ గ్రామాల్లో డిసెంబర్ 23 నుంచి ఈరోజు వరకు ఏదైతే పెండింగ్ అప్లికేషన్స్ ఉన్నాయో అవన్నీటిని మరలా మీరు ఎంపీడీవోలు దృష్టి తీసుకువచ్చిన గ్రామంలో ఆ లబ్ధిదారులతో టచ్ లో కెళ్ళడం వాళ్ళ అప్లికేషన్ తీసుకొచ్చి ఎంపీడీవోలకు ఇచ్చి కోఆర్డినేట్ చేసి ఒకటో తేదీన వాళ్ళందరికీ పెన్షన్ తెచ్చుకునే బాధ్యత మీ అందరూ తీసుకోమని కూటమి నాయకులు అందరికి విజ్ఞప్తి చేసుకుంటూ, ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన అధికారులు అందరికీ పేరుపేరునా హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ హాజరైన మీ అందరికీ శిక్షణకు ఎంపికైన మీ అందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేసిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో మహిళలు,అనపర్తి నియోజకవర్గ,అనపర్తి టౌన్ కూటమి నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు, మహిళలు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులకు వ్యతిరేకంగా

# మండపేట లో ముస్లిం సంఘాలు ర్యాలీ







- మా అణువణువునా భారతీయత నిండి ఉంది.
- భారతీయ ముస్లిం లను ఉగ్రవాదులతో ముడి పెట్టి చూడొద్దు
- మారణకాండ కు పాల్పడిన వారిని అల్లా ఖచ్చితంగా శిక్షిస్తాడు

**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 25:** భారతీయ ముస్లిం లు అందరి లోనూ అణువణువునా భారతీయత నిండి ఉందని, ఇక్కడి ముస్లింలను ఉగ్రవాదులతో ముడి పెట్టి చూడవద్దని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణ ముస్లిం లు పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రార్థనలు అనంతరం మండపేట లోని నాలుగు మసీదులకు చెందిన ప్రతినిధులంతా మండపేట లో శాంతి ర్యాలీ నిర్వహించారు. కలువపువ్వు సెంటర్ నుండి రాజారత్న సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదం నశించాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జమాతే ఇస్లామీ హింద్ నాయకులు ఇబ్రహీం షరీఫ్ మాట్లాడుతూ ఇస్లాం మారణకాండ కు పూర్తి వ్యతిరేకమన్నారు. పహల్గావ్ ఘటనకు పాల్పడిన వారిని అల్లా క్షమించడన్నారు. అయితే వారితో భారతీయ ముస్లింలను ముడి పెట్టి చూడటం బాధిస్తోందన్నారు. ఘటనలో మృతులకు అశ్రునివాంజలి ఘటించారు. ఓ పక్క వక్ఫ్ బోర్డు సవరణ చట్టం తమను వేధిస్తున్నా ఆ బాధను పంటి బిగువున దాచిపెట్టి ఈ దేశం కోసం తామంతా ముందుకు రావడం జరిగిందన్నారు. తమకు ఈ దేశం మాత్రమే ముఖ్యమని ఉద్ఘాటించారు. ఐక్య వేదిక నాయకులు జయరాజు మాదిగ, కోన సత్యనారాయణలు మాట్లాడుతూ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే సింధు జలాల ఒప్పందం రద్దు చేయడం హర్షణీయమని, భవిష్యత్ లో దేశ ప్రధాని నరేంద్ర మోదీ మరింత బుద్ధి చెప్పడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జామియ మస్జిద్ అధ్యక్షులు అల్తాఫ్, గాంధీనగర్ అల్ ఆమీన్ మస్జిద్ అధ్యక్షులు ఫారుఖ్ అలి, అక్సా మస్జిద్ అధ్యక్షులు మౌలాలీ, హంజ మస్జిద్ అధ్యక్షులు అర్షి, జమాతే ఇస్లామీ జిల్లా అధ్యక్షులు అమిర్, షరీఫ్, ఏపిజె చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మౌలానా, కరీం, సల్మాన్ హుస్సేన్, షహిద్, కమాల్, మస్జిద్ కమీటి సభ్యులు, జమాత్ ఇస్లామీ సభ్యులు అధిక సంఖ్యలో ముస్లిం, హిందు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

# డీలర్లకు బఫర్ అంటూ కోతలు పెట్టొద్దు







- డీలర్లకు కచ్చితమైన తూకంతో పూర్తి కోటా బియ్యం ఇవ్వాలని ఆదేశం
- చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- రెవెన్యూ సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని ఆదేశం

**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 25:** రాప్తాడు నియోజకవర్గం లోనిచెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలోని పౌరసరఫరాల శాఖ స్టేజ్-2, ఎంఎల్ఎస్ పాయింట్ (బియ్యం గోదాం)ను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఆమె గోదాం వద్దకు వెళ్లి బియ్యం స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. గత నెలలో డీలర్లకు ఎంత బియ్యం సరఫరా చేశారన్నది రికార్డులు చూశారు. అలాగే బియ్యం బస్తాల తూకాల్ని కూడా పరిశీలించారు. డీలర్లకు ప్రతి నెల బఫర్ అంటూ కోతలు విధిస్తున్నారన్న ఫిర్యాదులపై ఆమె అధికారులనడిగి ఆరా తీశారు. గత వైకాపా ప్రభుత్వంలో చేసిన తప్పిదాలకు ఇప్పటి డీలర్లు, ప్రజలు ఎందుకు ఇబ్బంది పడాలని ప్రశ్నించారు. ఇక నుంచి బఫర్ తో సంబంధం లేకుండా డీలర్లకు పూర్తి కోటా బియ్యం సరఫరా చేయాలని ఆదేశించారు. అలాగే డీలర్లు కూడా రేషన్ కార్డు దారునికి తూకం తక్కువ లేకుండా బియ్యం అందించాలన్నారు. చాలా మంది పేదలకు రేషన్ బియ్యం ఆకలి తీరుస్తోందని.. ఇలాంటి చోట తూకాలు తక్కువ ఇస్తూ ఇబ్బంది పెట్టవద్దన్నారు. ఇలాంటివి తన దృష్టికి వస్తే కచ్చితంగా డీలర్ షిప్ రద్దు చేసేందుకు కూడా వెనుకాడమని స్పష్టం చేశారు....

### రెవెన్యూ సమస్యలపై ఎమ్మెల్యే సునీత స్పందన

చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతతో పాటు తహసీల్దార్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. పలు గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యల్ని చెప్పుకున్నారు. ఇందులో ఎక్కువగా భూసమస్యలు ఉన్నాయి. అలాగే ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణం గురించి అర్జీలు ఇచ్చారు. భూసమస్యల్లో ఫ్రీ హోల్డ్, చుక్కల భూములు, అన్నదమ్ముల మధ్య భూ సమస్యలు వంటివి వచ్చాయి. ప్రతి అర్జీదారుడు చెప్పిన సమస్యను ఎమ్మెల్యే సునీత ఓపిగ్గా విన్నారు. కొన్ని సమస్యలకు ఎందుకు పరిష్కారం చూపలేదని రెవెన్యూ అధికారులను ఆరా తీశారు. ఎవరైనా ఒక సమస్య మీద వస్తే.. దాని పై వెంటనే స్పందించాలన్నారు. రెవెన్యూ సమస్యలపై అప్పటికప్పుడు పరిష్కారం చూపకపోతే.. అవి క్రమంగా పెద్దవి అవుతాయన్నారు. అన్నదమ్ముల మధ్య పరిష్కారాలు కుటుంబసభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో చర్చించి పరిష్కరించుకుంటే బాగుంటుందన్నారు. ఇలాంటి వాటిని కోర్టుల వరకు తీసుకెళ్లి సమస్యల్ని పెద్దవి చేసుకోవద్దన్నారు. చుక్కల భూములు, ఫ్రీ హోల్ట్ వంటి వాటిని నిశితంగా పరిశీలించి రెవెన్యూ అధికారులు పరిష్కారం చూపాలన్నారు. త్వరలోనే అర్హులైన అందరికీ ఇళ్ల పట్టాలతో పాటు ఇళ్లు కూడా మంజూరు చేస్తామని ఎమ్మెల్యే సునీత తెలిపారు....

## మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 25 :**త్రి భువన్ మల్టీ స్పెషలిటి హాస్పిటల్ ఆధ్వర్యంలోఅనంతపురం లో శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం అయిందని హిందూపురం పార్లమెంట్ టీడీపీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ కనా వత్ హేమ లత బాయ్ పేర్కొన్నారు. ఈ శిబిరం లో 700 మందికి ఉచిత వైద్యం చేశారు.డా. వికాస్ నరసింహ ఆర్ వి సుదర్శన్, ఎస్ బి సోమసుందర్ నాయక్ తదితరులు పాల్గొని రోగులను పరీక్షించారు.టీడీపీ రైతు కార్యదర్శి రమేష్ బాబు, కన్వీనర్ కరణ%శీ% ప్రభాకర్,తుమ్మల మనోహర్, కుళ్లాయప్ప నాయక్, దినేష్ నాయక్ తదితరులు టీడీపీ కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతి ర్యాలీ బందోబస్త్ చర్య లు చేపట్టిన ట్రాఫిక్ పోలీస్



**అంకుశం న్యూస్ ధర్మవరం ఏప్రిల్ 25:** ధర్మవరం లో జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం జరిగిన శాంతి ర్యాలీ కి ధర్మవరం టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్,ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ ఐ వెంకట రాముడు సిబ్బంది బందోబస్త్ చర్యలు చేపట్టారు.

## తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



**అంకుశం న్యూస్ ధర్మవరం ఏప్రిల్ 25:** ఉగ్ర దాడులకు నిరసన గా ధర్మవరం లో శుక్రవారం సాయంత్రం ధర్మవరం తెలుగుదేశం పార్టీ పెద్ద ఎత్తున శాంతి ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీ లో రాష్ట్ర టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, పట్టణ టీడీపీ అధ్యక్షులు పరిసే సుధాకర్, అంబటి సనత్, 15 వార్డు టీడీపీ నాయకులు పల్లెం కృష్ణ, శ్రీ శైలం పురుషోత్తం గౌడ్, తెలుగు మహిళలు బీమనేని నాయుడు, టీడీపీ కిరోసిన్ పోతలయ్య, కత్తుల బాబ్జి, ఫణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.